ఆదివారం 21-4-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 312, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

## రైతులను చంపిన బిజెపిని బొంద పెట్టాలి





- కేసీఆర్ ఏనాడూ మెదక్‌ను పట్టించుకోలే
- ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేస్తా
- మెదక్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

**ముందడుగు మెదక్ :**

పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోడీ మోసం చేశారు. మీ బ్యాంకు ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామన్నారు.. ఒక్క రూపాయి అయినా వేశారా? ఢిల్లీలో రైతులను చంపిన బిజెపిని బొంద పెట్టాలని మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నీలం మధు నామినేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. ''రాష్ట్రంలో రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇళ్లు నిర్మించాలని ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం ప్రారంభించాం. పేదోడికి సొంత ఇల్లు ఉంటే గౌరవంగా జీవిస్తారు. కాంగ్రెస్‌ను ఓడించి.. ఇచ్చే ఇళ్లను రద్దు చేయాలని ఢిల్లీలో ఉండే మోడీ, గజ్వేల్‌లో ఉండే కేసీఆర్ కుట్రలు చేస్తున్నారు. పేదవాడి కళ్లలో ఆనందం చూసి ఓర్వలేకపోతున్నారు. వచ్చే వరి పంటను రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసే బాధ్యత నాది. ఏడుపాయల దుర్గమ్మ, మెదక్ చర్చి సాక్షిగా చెబుతున్నా.. ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

మోడీ, కేసీఆర్ ఏనాడూ మెదక్ ప్రాంతాన్ని పట్టించుకోలేదు. ఈ ప్రాంతానికి కేంద్రం ఏదైనా పరిశ్రమ ఇచ్చిందా? మల్లన్నసాగర్‌లో వేల ఎకరాలు గుంజుకున్నది ఎవరో మనకు తెలియదా? ఆనాడు కలెక్టర్‌గా ఉండి పేదల భూములు గుంజుకున్న వ్యక్తే.. నేడు భారాస అభ్యర్థి. కాంగ్రెస్‌పై చెయ్యి వేస్తే మాడి మసైపోతారు. నేను జైపాల్‌రెడ్డి, జానారెడ్డిని కాదు.. జాగ్రత్తగా ఉండాలి. పదేళ్ల ఇక్కడే ఉంటాం.. ఎవరు వస్తారో రండి. కాంగ్రెస్ కష్టాల్లో ఉన్నప్పుడు మెదక్ ప్రజలు ఇందిరమ్మను గెలిపించారు. ఇందిరాగాంధీ.. హైదరాబాద్‌కు అనేక పరిశ్రమలు కేటాయించారు. బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఇక్రిశాట్‌ను ఇచ్చారు. పేద ముదిరాజ్ బిడ్డకు ఎంపీ టికెట్ ఇచ్చాం.. గెలిపించే బాధ్యత మీదే'' అని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పలువురు కాంగ్రెస్ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.




## జైల్లో కేజ్రీవాల్‌పై కుట్ర జరుగుతోంది

- ఇన్సులిన్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు
- అనారోగ్య సమస్యలతో మరణించేలా ప్లాన్
- ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ ఆరోపణ

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై తీహార్ జైల్లో భారీ కుట్ర జరుగుతోందని ఆప్ పార్టీ నేత సౌరభ్ భరద్వాజ్ శనివారం ఆరోపించారు. డయాబెటిస్‌తో బాధపడుతున్న అరవింద్ కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వడానికి జైలు అధికారులు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ఆయన అవయవాలపై ప్రభావం పడి అనారోగ్య సమస్యలతో నెమ్మదిగా మరణించేలా జైల్లో కుట్ర జరుగుతోందని అన్నారు. కేజ్రీవాల్ తన రెగ్యులర్ డాక్టర్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంప్రదించేందుకు అనుమతించాలని కోరుతూ వేసిన పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు తన నిర్ణయాన్ని రిజర్వ్ చేసిన ఒక రోజు అనంతరం భరద్వాజ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ''కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వకపోవడం వల్ల గుండె, కిడ్నీలపై మిగతా 2లో

## మహిళల భద్రతే నా ప్రాధాన్యం

- 'ఇండియా' కూటమి చరిత్ర అంతా కుంభకోణాలే
- కర్ణాటక ఎన్నికల ప్రచార సభలో మోడీ

**ముందడుగు కర్ణాటక:**

దేశ, విదేశాల్లోని శక్తిమంతులైన వ్యక్తులు నన్ను అధికారం నుంచి తొలగించేందుకు ఏకమయ్యారు. కానీ.. నారీ, మాతృశక్తుల ఆశీర్వాదంతో వారితో పోరాడగలుగుతున్నాను. మహిళల భద్రతే నా ప్రాధాన్యం'' అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటకలోని చిక్కబళ్లాపురలో నిర్వహించిన ప్రచార సభలో మోడీ పాల్గొని ప్రసంగించారు. ''మాతృమూర్తులు, సోదరీమణులు ఇక్కడికి పెద్దసంఖ్యలో వచ్చారు. కుటుంబపోషణలో భాగంగా మిగతా 2లో



## అమిత్ షాకు సొంత కారు లేదు

- తన స్థిర, చరాస్తులు రూ.36 కోట్లు
- అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను వెల్లడి



**ముందడుగు గుజరాత్:**

కేంద్ర హోంమంత్రి, బిజెపి సీనియర్ నేత అమిత్ షా గుజరాత్‌లోని గాంధీనగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. అయన శుక్రవారం

ముందడుగు
ఆదివారం
21-4-2024
హైదరాబాద్

# ఫలితాలు రాకుండా ఎలా చెప్తున్నారు

## 400 సీట్లు వస్తాయని బీజేపీది అతివిశ్వాసం ● మోడీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ

**ముందడుగు కేరళ:**




ఎన్నికలు పూర్తి కాకుండా, ఎన్నికల ఫలితాలు రాకుండా ఫలానా పార్టీని ఓటర్లు తిరస్కరించారంటూ ఎలా చెప్తారని తొలి దశ పోలింగ్‌లో ఓటర్లు కాంగ్రెస్ పార్టీని, ఇండియా కూటమిని తిరస్కరించారంటూ ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. కేరళలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆమె దీనిపై మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం 21 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలోని 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఇందులో పెద్దసంఖ్యలో ఓటర్లు ఎన్డీయే కూటమికి ఓటేశారని, విపక్షాలను తిరస్కరించారని పేర్కొన్నారు. దీనిపై ప్రియాంక స్పందిస్తూ.. ఫలితాలు రాకుండా ఆయనకు ఎలా తెలుసన్నారు. ఈసారి 400 సీట్లు వస్తాయని ఆ పార్టీ అతివిశ్వాసంతో ఉందన్నారు. తాను ఎక్కడికెళ్లినా అక్కడి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అది కచ్చితంగా జరిగి తీరుతుందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ప్రజాస్వామ్య పద్ధతులను కాలరాసి చట్టాలు చేస్తోందని ప్రియాంక గాంధీ విమర్శించారు. తమ ప్రీతిపాత్రులైన మిత్రుల ప్రయోజనాల కోసం చట్టాలను రూపొందిస్తూ.. సామాన్యులను నిరుద్యోగం, పేదరికంలో నెడుతోందని ఆరోపించారు. చైనా దురాక్రమణపై లద్దాఖ్‌లో ఆందోళనలు చేస్తుంటే కేంద్రం మౌనంగా ఉందని విమర్శించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తారా? అని విలేకరులు అడిగినప్పుడు 'కొన్ని రోజులు ఆగండి మీకే తెలుస్తుంది' అంటూ సమాధానం ఇచ్చారు.

## జైల్లో కేజ్రీవాల్‌పై కుట్ర జరుగుతోంది

మొదటిపేజీ తరువాయి

తీవ్ర ప్రభావం పడుతుంది. దీనివల్ల రెండు, మూడు నెలల అనంతరం ఆయనను విడుదల చేసినా ఏ ప్రయోజనం ఉండదు. ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి వస్తుంది'' అని భరద్వాజ్ అన్నారు.

అరవింద్ కేజ్రీవాల్ మెడికల్ బెయిల్ కోసం చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండే అరటిపండు, మామిడి పండ్లు, స్వీట్లు, ఆలూ పూరీ వంటివి తింటున్నారని ఇటీవల ఈడీ ఆరోపించింది. శుక్రవారం జరిగిన విచారణలో కేజ్రీవాల్ తరఫున న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ఈడీ చేసిన ఆరోపణలను ఖండించారు. బెయిల్ కోసం తమ నేతకు పక్షవాతం రావాలని తాము కోరుకుంటామా అని ప్రశ్నించారు. డాక్టర్ తయారుచేసిన డైట్ చార్ట్ ప్రకారమే సీఎం ఆహారం తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు.

## మహిళల భద్రతే నా ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

మీరు ఎదుర్కొంటున్న సవాళ్లు, చేస్తోన్న పోరాటం గురించి తెలుసు అన్నారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో దిశానిర్దేశం చేసేందుకు ఒక్క నాయకుడూ లేడని ప్రధాని మోడీ ఈసందర్భంగా ఎద్దేవా చేశారు. అందులోని భాగస్వామ్య పక్షాలకు ఎటువంటి భవిష్యత్తు కార్యాచరణ లేదని, వాటి చరిత్ర అంతా కుంభకోణాలతో నిండిఉందని విమర్శలు గుప్పించారు. 102 స్థానాల్లో శుక్రవారం నిర్వహించిన తొలిదశ పోలింగ్.. ఎన్డీయే, 'వికసిత్ భారత్'కు అనుకూలంగా సాగిందని చెప్పారు. సభలో భాగంగా వేదిక పంచుకున్న మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత దేవెగౌడపై మోడీ ప్రశంసలు కురిపించారు. 90 ఏళ్లలోనూ ఆయన ఉత్సాహం, నిబద్ధత తనలో స్ఫూర్తి నింపినట్లు తెలిపారు. జేడీఎస్ గతేడాది సెప్టెంబరులో ఎన్డీయేలో చేరిన విషయం తెలిసిందే. ఇదిలాఉండగా.. మొత్తం 28 స్థానాలున్న కర్ణాటకలో రెండు విడతల్లో (ఏప్రిల్ 26, మే 7) పోలింగ్ నిర్వహించనున్నారు.

## ఓటేసి గెలిపిస్తే నీళ్ల సమస్య తీరుస్తా

### డీకే శివకుమార్ వ్యాఖ్యలపై ఈసీ కేసు



**ముందడుగు కర్ణాటక:**

సార్వత్రిక ఎన్నికల వేళ కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. తన సోదరుడు సురేశ్ తరఫున ప్రచారంలో భాగంగా డీకే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారంటూ ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఎన్నికల్లో డీకే సురేశ్ బెంగళూరు రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఇటీవల తన సోదరుడి తరఫున ఈ ప్రాంతంలో శివకుమార్ ప్రచారంలో పాల్గొన్నారు. ఓ హౌసింగ్ సొసైటీలో ఆయన ఓటర్లను అభ్యర్థిస్తున్న వీడియో ఒకటి నెట్టింట వైరల్ అయ్యింది. ''నేను ఇక్కడికి ఓ బిజినెస్ డీల్ కోసం వచ్చా. నా సోదరుడు సురేశ్‌కు మీరు ఓటేసి గెలిపిస్తే.. మూడు నెలల్లో మీ ప్రధాన సమస్యను పరిష్కరిస్తాను. కావేరీ నదీ జలాలు సరఫరా చేసి మీకు అవసరమైన నీటిని కూడా కేటాయిస్తాం.'' అని డిప్యూటీ సీఎం అందులో చెప్పినట్లుగా ఉంది.

ఈ వీడియోను బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారాన్ని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. డీకే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లు ధ్రువీకరించింది. ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించినందుకు గానూ ఆయనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు కర్ణాటక ప్రధాన ఎన్నికల అధికారి వెల్లడించారు.



## నక్సల్ నేత హిడ్మా గ్రామంలో ఒక్క ఓటు పడలే

### భయం వల్లే ఓటు వేయలేదంటున్న అధికారులు

**ముందడుగు ఛత్తీస్‌ఘడ్:**

సార్వత్రిక ఎన్నికల తొలి విడతలో భాగంగా ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ లోక్‌సభ నియోజకవర్గంలో శుక్రవారం పోలింగ్ జరిగింది. దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలని మావోలు పిలుపు ఇచ్చారు. కానీ చాలా వరకు గ్రామాల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కానీ కరుడుకట్టిన నక్సల్ నేత హిడ్మాకు చెందిన పువర్తి గ్రామంలో ప్రజలు ఎవరూ ఓటు హక్కును వినియోగించుకోలేదు. బస్తర్ ప్రాంతంలో జరిగిన అనేక నక్సల్స్ దాడుల్లో హిడ్మా పాత్ర ఉన్న విషయం తెలిసిందే. శుక్రవారం ఆ నియోజకవర్గంలో 67.56 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. కానీ పువర్తి గ్రామ పోలింగ్ బూత్ నుంచి ఎవరూ ఓటు హక్కును వాడుకోలేదని తెలిసింది. భయం వల్ల గ్రామస్తులు ఓటు వేయలేదని బూత్ లెవల్ ఆఫీసర్ తెలిపారు. పువర్తి పోలింగ్ బూత్ కింద మూడు గ్రామాలు ఉన్నాయి. దాంట్లో పువర్తి, టేకల్‌గూడమ్, జొన్నగూడ ఉన్నాయి. పువర్తిలో 332 మంది, టేకుల్‌గూడంలో 158 మంది, జొన్నగూడలో 157 మంది ఓటర్లు ఉన్నారు. అయితే పువర్తి గ్రామంలో ఉన్న బూత్ నుంచి ఒక్కరు కూడా ఓటు వేయలేదు.

## అమిత్ షాకు సొంత కారు లేదు

మొదటిపేజీ తరువాయి



నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా తన ఆస్తుల వివరాలను వెల్లడించారు. తనకు మొత్తం రూ.36 కోట్ల స్థిర, చరాస్తులు ఉన్నట్లు ప్రకటించారు. ఇప్పటికీ తనకు సొంత కారు లేదని పేర్కొన్నారు. నామినేషన్ వివరాల ప్రకారం.. అమిత్ షాకు రూ.20 కోట్ల చర, రూ.16 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. తన భార్య సోనాల్‌కు రూ.31 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. కేంద్రమంత్రికి రూ.72 లక్షల విలువైన ఆభరణాలు, ఆయన సతీమణికి రూ.1.10 కోట్ల విలువైన నగలున్నాయి. అమిత్ షా పేరు మీద రూ.15.77లక్షల రుణం, సోనాల్ పేరు మీద రూ. 26.32లక్షల రుణం ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

202223లో కేంద్రమంత్రి వార్షికాదాయం రూ.75.09లక్షలుగా ఉండగా.. ఆయన సతీమణి రూ.39.54లక్షలు ఆర్జించారు. ఎంపీగా అందుకునే వేతనంతో పాటు భూమి, ఇంటి అద్దెలు, వ్యవసాయం, షేర్లు, డివిడెండ్ల నుంచి తనకు ఆదాయం వస్తున్నట్లు అఫిడవిట్‌లో తెలిపారు. వృత్తిరీత్యా తాను రైతునని, సామాజిక కార్యకర్తనని వెల్లడించారు. తనపై మూడు క్రిమినల్ కేసులు నమోదైనట్లు ప్రకటించారు.

ముందడుగు
ఆదివారం
21-4-2024
హైదరాబాద్

# గడువు ముగిసిన చాక్లెట్లు తిన్న చిన్నారి

## రక్తం వాంతులు కావడంతో ఆసుపత్రికి తరలింపు

**ముందడుగు పంజాబ్:**
తేదీ ముగిసిన చాక్లెట్లు తిన్న ఏడా దిన్నర వయసున్న పాప రక్తం వాంతులు కావడంతో ఆ చిన్నారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అంది స్తున్నారు. ఈ నేపథ్యంలో అమ్మిన షాపులోని గడువు ముగిసిన చాక్లెట్లు, ఇతర తినుబండారాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్‌లోని లూథియానాలో ఈ సంఘటన జరిగింది. ఆ చిన్నారి తన కుటుంబంతో కలిసి పాటియాలా వెళ్లింది. సెండాఫ్ సందర్భంగా బంధువులు స్నాక్స్, చాక్లెట్లతో కూడిన బాక్స్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు. లూథియానాకు తిరిగి వచ్చిన తర్వాత బాక్స్‌లోని చాక్లెట్లను ఆ బాలిక తిన్నది. దీంతో ఆ పాపకు రక్తం వాంతులు అయ్యాయి. ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే



ఆసుపత్రికి తరలించారు. గడువు ముగిసిన చాక్లెట్లు తినడం వల్ల ఆ చిన్నారి అస్వస్థతకు గురైనట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారించారు. ఆ పాపను ఆసుపత్రిలో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నారు.

మరోవైపు గడువు ముగిసిన చాక్లెట్ల అమ్మకం గురించి ఆరోగ్య అధికారులు, పోలీసులకు ఆ పాప బంధువులు ఫిర్యాదు చేశారు. దీంతో వాటిని అమ్మిన షాపును అధికారులు తనిఖీ చేశారు. ఆ షాపులో ఉన్న గడువు ముగిసిన చాక్లెట్లు, ఇతర స్నాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆరుగురు పిల్లలకు జన్మనిచ్చిన మహిళ

## పాకిస్థాన్‌లోని రావల్పిండిలో ఘటన

**ముందడుగు పాకిస్తాన్:**
27 ఏళ్ల యువతి ఆరుగురు పిల్లలకు జన్మనిచ్చిన అరుదైన ఘటన పాకిస్థాన్‌లోని రావల్పిండిలో జరిగింది. పాకిస్తాన్ వార్తాపత్రిక డాన్ ప్రకారం, హజారా కాలనీకి చెందిన మహ్మద్ వహీద్ భార్య జీనత్ వహీద్ గర్భవతి, ప్రసవ నొప్పి కారణంగా గురువారం రాత్రి ఆసుపత్రికి తీసుకువచ్చారు. దీంతో శుక్రవారం నాడు జీనత్ గంట వ్యవధిలో ఒకరి తర్వాత ఒకరుగా ఆరుగురు పిల్లలకు జన్మనిచ్చింది. ఆరుగురు శిశువుల్లో నలుగురు అబ్బాయిలు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫర్జానా తెలిపారు.



మొత్తం ఆరుగురు పిల్లల బరువు రెండు పౌండ్ల కంటే తక్కువగా ఉంది కానీ ప్రస్తుతం తల్లీ, బిడ్డల ఆరోగ్యం బాగానే ఉంది. వైద్యులు శిశువులను ఇంక్యుబేటర్‌లో ఉంచారు, కానీ ప్రమాదం లేదు. జీనత్‌కి ఇదే తొలి డెలివరీ. వారికి ఉత్తమ చికిత్స అందించడానికి వైద్యులు ప్రయత్నిస్తున్నారు. ఇది నార్మల్ డెలివరీ కాదని, డెలివరీ ఆర్డర్‌లో పాప మూడోదని ఆస్పత్రిలోని లేబర్ రూమ్ డ్యూటీ ఆఫీసర్ తెలిపారు.

# అన్న వైఎస్ జగన్‌కు రూ.82.58 కోట్ల అప్పు

- వైఎస్ షర్మిల ఆస్తులు రూ.182.82 కోట్లు
- ఎన్నికల అఫిడవిట్లో షర్మిళ ఆస్తులు వెల్లడి

**ముందడుగు కడప:**
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కడప పార్లమెంట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు సందర్భంగా.. ఎన్నికల అఫిడవిట్లో తనకున్న ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలను షర్మిల ప్రస్తావించారు. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం వైఎస్ షర్మిల ఆస్తులు, అప్పుల వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్ షర్మిల తనకు రూ.182.82 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్లో పేర్కొన్నారు. స్థిరాస్తులు రూ.9.29 కోట్లు కాగా.. చరాస్తులు రూ.123.26 కోట్లని తెలిపారు. అలాగే తన వద్ద రూ.3.69 కోట్ల విలువైన బంగారు, రూ.4.61 కోట్ల విలువైన జెమ్ స్టోన్స్ ఆభరణాలు ఉన్నట్లు షర్మిల తన ఎన్నికల అఫిడవిట్లో ప్రస్తావించారు.



అప్పుల విషయానికి వస్తే.. తన అన్న, వైఎస్ జగన్ వద్ద రూ.82.58 కోట్లు అప్పు తీసుకున్నట్లు వైఎస్ షర్మిల తన అఫిడవిట్లో పేర్కొన్నారు. అలాగే వైఎస్ జగన్ సతీమణి, తన వదిన వైఎస్ భారతి రెడ్డి వద్ద రూ.19.56 లక్షలు అప్పు తీసుకున్నట్లు తెలిపారు. ఇక వైఎస్ షర్మిల భర్త.. బ్రదర్ అనికల్ కుమార్.. షర్మిల తల్లి.. తన అత్తగారైన వైఎస్ విజయమ్మ వద్ద 40 లక్షలు అప్పు తీసుకున్నట్లు అఫిడవిట్లో ఉంది. అలాగే షర్మిల వద్ద కూడా 30 కోట్ల వరకూ అప్పు తీసుకున్నట్లు షర్మిల తన అఫిడవిట్లో పేర్కొన్నారు. ఇక తనపై ఎనిమిది కేసులు ఉన్నట్లు షర్మిల ఎన్నికల అఫిడవిట్లో వెల్లడించారు.

# బంగ్లాదేశ్ నుంచి వచ్చి ఓటేసిన భారతీయులు

## సరిహద్దు గ్రామాల్లో నివసిస్తున్న 2500 మంది




**ముందడుగు జాతీయం:**
బంగ్లాదేశ్ సరిహద్దు గ్రామాల్లో నివసిస్తున్న సుమారు 2500 మంది భారతీయులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు దేశ సరిహద్దు దాటారు. చారిత్రక కారణాల వల్ల త్రిపురకు చెందిన ప్రజలు భారత్, బంగ్లాదేశ్ సరిహద్దు గ్రామాల్లో నివసిస్తున్నారు. శుక్రవారం పశ్చిమ త్రిపుర పార్లమెంట్ స్థానానికి పోలింగ్ జరిగింది. త్రిపురలోని రాంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధికి చెందిన పలు గ్రామాలు భారత్, బంగ్లాదేశ్ సరిహద్దులో ఉన్నాయి. ఒక గ్రామంలో 19 భారతీయ కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇందులోని 50 మంది ఓటర్లు సరిహద్దు దాటి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారత్‌బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలోని జయనగర్‌తోపాటు పలు ప్రాంతాలకు చెందిన సుమారు 2,500 మంది భారతీయులు ఫెన్సింగ్ దాటి వచ్చి ఓటు వేశారు. త్రిపురలోకి ప్రవేశించిన గ్రామస్తులను ఫొటో గుర్తింపు కార్డుల ద్వారా బీఎస్ఎఫ్ జవాన్లు ధృవీకరించారు. అగర్తలా నగరానికి అతి సమీపంలో ఉన్న జయనగర్ ప్రాంతంలో మహిళా బీఎస్ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహించారు.

### ఆకట్టుకునే కథాంశంతో వెన్నెల మాక్రో ఫిల్మ్




**ముందడుగు హైదరాబాద్:**
శ్రీనాగ్ క్రియేషన్ లో శివ నాగరాజ్ దర్శకుడిగా ప్రయోగత్మకంగా తెరకెక్కిన మిని మాక్రో ఫిల్మ్ "వెన్నెల". ఈ సినిమాలో హీరో, హీరోయిన్ గా యూట్యూబ్ యాక్టర్ ప్రసాద్ టోనీ, అనూష శ్రీ నటించారు. చిన్నప్పటి నుండి మనుసులో దాచుకున్న ప్రేమ అమ్మాయికి తెలిపిన మరుసటి రోజే హీరో చేసిన చిన్న తప్పు వల్ల అమ్మాయి చనిపోతుంది. అస్సలు ఆ తప్పు ఏంటి వెన్నెల ఎందుకు చనిపోయింది అనే కొత్త కథతో ఈ మాక్రో ఫిల్మ్ తొందర్లో యూట్యూబ్ లో రాబోతుంది. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీ శివ నాగరాజ్, ఎడిటర్ కేతన్ కంచర్ల, లిరిక్స్ శ్రీనాథ్ మహీంద్రా,మ్యూజిక్ జాన్ పాట్ల, అసిస్టెంట్స్ జాఫర్ వలి, కేశవ, సోషల్ మీడియా ప్రమోటర్ త్రినాథ్ రెడ్డి, కథ మాటలు దర్శకత్వం శివ నాగరాజ్ అందించారు.

ముందడుగు
ఆదివారం
21-4-2024
హైదరాబాద్




## యాజమాన్య అనుభవ కార్యక్రమాన్ని ప్రకటించిన గ్లోస్టర్

**ముందడుగు హైదరాబాద్:**

100 ఏళ్ళకు పైగా వారసత్వం కలిగిన బ్రిటిష్ ఆటోమొబైల్ బ్రాండ్ ఎంజి (మోరిస్ గ్యారేజెస్) భారత దేశంలో స్వయంప్రతిపత్తి కలిగిన మొట్టమొదటి (లెవల్ 1) ప్రీమియం ఎస్‌యువి అయిన ఎంజి గ్లోస్టర్ కోసం ప్రత్యేకమైన యాజమాన్య అనుభవ కార్యక్రమాన్ని ప్రకటించింది. కారు నిర్వహణపై సున్నా వ్యయంతో పూర్తి మనశ్శాంతికి హామీ ఇవ్వడం ద్వారా అనుభవాన్ని మరింత పెంచడం కొత్తగా ప్రవేశ పెట్టిన ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ యాజమాన్య అనుభవం ద్వారా, గ్లోస్టర్ తాలూకు అనేక అద్భుతమైన ఫీచర్లను అవరోధాలు లేకుండా అందుకోవడానికి అనుగుణంగా విక్రయానంతర సేవల ఆఫర్లను ఎంజి మోటార్స్ ఇండియా ప్రవేశ పెట్టింది. ఎంజి గ్లోస్టర్, ఆఫ్‌రోడర్ ఎస్‌యువి, ప్రీమియం వాహన విభాగంలో తనదైన ఒక సముచిత స్థానాన్ని ఏర్పరుచుకుంది, ఆకర్షణీయమైన తన డిజైన్‌తో కస్టమర్‌లను గెలుచుకుంది, దృఢమైన నిర్మాణ నాణ్యత, విలాసవంతమైన ఫీచర్లకు ఇది పేరుపొందింది, ఇప్పుడు యాజమాన్య అనుభవాన్ని మరొక అడుగు ముందుకు తీసుకువెళ్ళింది.



## ఇనుప మేకులు మింగిన రిమాండ్ ఖైదీ

### ప్రాణాలు కాపాడిన గాంధీ ఆసుపత్రి వైద్యులు

**ముందడుగు హైదరాబాద్:**

చర్లపల్లి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న యువకుడు ఇనుప మేకులు మింగి ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. తీవ్రమైన కడుపునొప్పితో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఖైదీని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి వైద్యులు కాపాడారు. వివరాల్లో వెళితే. చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మహ్మద్ షేక్ (32) తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. జైలు వైద్యుల సూచన మేరకు నాలుగు రోజుల క్రితం గాంధీ ఆసుపత్రి ప్రిజనర్స్ వార్డులో చేర్పించారు. ఖైదీ కడుపులో కొన్ని ఇనుప మేకులు ఉన్నట్టు పలు రకాల వైద్య పరీక్షలు, ఎక్స్‌రేలో తేలింది. గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ నేతృత్వంలో శనివారం పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా దాదాపు 45 నిమిషాల పాటు శ్రమించి ఎండోస్కోపీ ద్వారా తొమ్మిది మేకులను బటయకు తీశారు. ఛాలెంజ్‌గా తీసుకొని రోగి కడుపులోని మేకులను బయటకు తీశామని, ఏమాత్రం అజాగ్రత్త జరిగినా ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు తెలిపారు.

# ఏ వయస్సు పిల్లలకు గుడ్లు తినిపించాలి

- ఎప్పటి నుంచి గుడ్లు తినిపించాలి..
- మనిషి ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు

**ముందడుగు ప్రత్యేకం:**

గుడ్డు మంచి బలమైన పౌష్టికాహారం. మనిషి ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా పిల్లలకు గుడ్డు తనిపిస్తే అందులోని ప్రోటీన్, ఖనిజాలు, ఇతర అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ చాలా మందికి తమ పిల్లలకు ఏ వయసు నుంచి గుడ్డు తినిపించాలి? రోజుకు ఎన్ని గుడ్లు ఇవ్వాలి? అనే సందేహం మిగిలిపోతుంది.



### పిల్లలకు ఏ వయస్సు నుండి గుడ్లు తినిపించాలి?

నిజానికి.. ఆరు నెలల తర్వాత పిల్లలకు గుడ్లు ఇవ్వడం ప్రారంభించవచ్చు. ఈ వయస్సు నుంచి వారికి ఎక్కువ పోషకాహారం అవసరం. గుడ్డులో పుష్కలంగా ప్రోటీన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

### రోజుకు ఎన్ని గుడ్లు తినాలి?

బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చినప్పటి నుంచి గుడ్లు ఇవ్వడం ప్రారంభించాలి. అయితే మొదట్లో సగం గుడ్డు మాత్రమే తినిపించాలి. నెమ్మదిగా అలవాటు చేయాలి. దీనితో పాటు మరికొన్ని ఆహారాలు కూడా తినిపించాలి. తద్వారా పిల్లలకు అలెర్జీ ఉందో లేదో తెలుసుకోవచ్చు. క్రమంగా పిల్లవాడు పెరుగుతున్నప్పుడు సగం గుడ్డుకు బదులుగా మొత్తం గుడ్డు ఇవ్వడం ప్రారంభించాలి. బిడ్డకు ఏడాది వయస్సు వచ్చినప్పటి నుంచి ప్రతిరోజూ మొత్తం గుడ్డు తినిపించవచ్చు. ఇది బిడ్డ ఎదుగుదలకు సహాయపడటమే కాకుండా పిల్లల ఎముకలను బలపరుస్తుంది.

### గుడ్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు

గుడ్లలో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. ఇది పిల్లల కండరాలను బలపరుస్తుంది. అంతే కాకుండా ఇందులో ఉండే విటమిన్ ఎ, డి, ఇ పిల్లల ఎముకలతో పాటు కళ్లకు బలం చేకూరుస్తాయి.

### గుడ్డులోని ఏ భాగాన్ని ఆహారంగా ఇవ్వాలి?

మీ చిన్నారికి మొదటిసారి గుడ్లు ఇస్తున్నట్లయితే పసుపు భాగంతో ప్రారంభించాలి. ఆపై క్రమంగా గుడ్లను తినడం ప్రారంభించినప్పుడు మొత్తం గుడ్డుకు ఆహారంగా ఇవ్వొచ్చు.

### గుడ్లు తినిపించేటప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

కొంతమంది పిల్లలకు గుడ్లు అంటే ఎలర్జీ రావచ్చు. కాబట్టి మొదట కొద్దిగా మాత్రమే గుడ్డు తినిపించాలి. అలెర్జీ లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. పిల్లలకు ఎప్పుడూ తాజా గుడ్లు మాత్రమే తినిపించాలి. ఎక్కువ కాలం ఉంచిన గుడ్లు ఇవ్వకూడదు.

# డిపాజిట్ కోసమే బీఆర్ఎస్ తాపత్రయం

- కూతురు లిక్కర్ స్కామ్‌లో...
- పార్టీ ఫోన్ ట్యాపింగ్ కేసులో..
- గెలిచిన ఎమ్మెల్యేలనూ నిలబెట్టుకోలేకపోతున్న పార్టీ
- స్థానిక ఎన్నికల కోసమే కాంగ్రెస్ రుణమాఫీ డ్రామా
- పంద్రాగస్టు డెడ్‌లైన్ అందుకోసమే
- కాంగ్రెస్ బడే మియా.. బీఆర్ఎస్ ఛోటే భాయ్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**ముందడుగు హైదరాబాద్:**

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోసమే తాపత్రయపడుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కూతురు.. బీరు, బ్రాండీ స్కామ్ లో, బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ స్కామ్ లో ఇరుక్కుందని ఆయన విమర్శలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ రోజురోజుకూ కనుమరుగవుతోందని పేర్కొన్నారు. కొందరు నేతలు పార్టీలు మారడంతో ప్రజలు అసహ్యించుకుంటున్నారని, కేసీఆర్ కు కూడా ఇది ఇబ్బంది పెడుతున్నట్లు ఉందని, అందుకే ఫ్రస్టేషన్ లో మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఓడిపోయి 5 నెలలు కావస్తున్నా కేసీఆర్, కేటీఆర్ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. జైశ్రీరామ్ అన్నం పెడుతుందా అని వ్యాఖ్యానించిన కేటీఆర్.. ఇటీవల జై శ్రీరామ్ అంటూ బీజేపీని తొక్కాలని అన్నాడని, కామారెడ్డిలో కేసీఆర్ ను బీజేపీ తొక్కింది సరిపోలేదా? అని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు సోనియమ్మ, ఇందిరమ్మ, రాహుల్ రాజ్యం వస్తుందని ఒక్కొక్కరు ఒకొక్కటి చెబుతున్నారని కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. ఎన్నికల కోడ్ ను సాకుగా చెబుతూ పథకాల అమలును దాటవేస్తున్నారని ఫైరయ్యారు. ఎన్నికల షెడ్యూల్ కు ముందే 100 రోజులు దాటిందని, అప్పుడు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. జూన్ 4న కోడ్ ముగుస్తుందని, జూన్ 5కి పథకాలు అందజేయొచ్చు కదా అని నిలదీశ్యారు. ఆగస్టు వరకు పెండింగ్ పెట్టడం ఎందుకని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల తరువాత ప్రజలను మోసం చేయాలని కాంగ్రెస్ చూస్తోందని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ దగాకోర్ పార్టీ అంటూ ఘాటు విమర్శలు చేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ కు ప్రజలు ఓటు వేయొద్దని కిషన్ రెడ్డి కోరారు.